మెరుగు పెట్టకుండా వజ్రానికి,
కష్టాలు ఎదుర్కోకుండా
మనిషికి గుర్తింపు రాదు
- సర్వేపల్లి రాధాకృష్ణన్

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

గురువారం, 05 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 107

## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ కానున్న

# సీఎం రేవంత్



**న్యూఢిల్లీ, మార్చి 04:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. అందుకోసం అమిత్ షా కార్యాలయానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు. అదీకాక ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహరెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే మీడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజయ్ కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించనున్నారని చర్చ నడుస్తోంది.

## తెలంగాణలో జనాభా లెక్కల సేకరణ..

# మే 11 నుంచి ఇళ్ల గణన: సీఎస్



**హైదరాబాద్ :** కేంద్రం దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన జనగణన ప్రక్రియలో భాగంగా.. తెలంగాణలో మొ దటి దశ పనులను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ ప్రభుత్వం రెడీ అవుతోంది. మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, కట్టడాల వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తాజాగా అధికారులను ఆదే శించారు. సెక్రటేరియట్‌లో అన్ని శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వ హించిన ఆయన.. కీలక మార్గదర్శకాలను విడుదల చేశారు. జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచా లకురాలు భారతీ హోళికెరితో కలిసి ఆయన ఇళ్ల లెక్కింపు ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు. ఇక ఈసారి జనాభా లెక్కల సేకరణలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోబోతోంది. దేశ చరిత్ర లోనే మొదటిసారిగా ఈ ప్రక్రియను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో కొనసాగించనున్నారు. క్షేత్రస్థాయిలో డేటా సేకరించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్‌ను సైతం వినియోగించనున్నారు. జనభాను లెక్కించే సిబ్బంది నేరుగా తమ స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా వివరాలను నమోదు చేస్తారు. దీనివల్ల సమాచారం అత్యంత వేగంగా, కచ్చితత్వంతో కేంద్రీకృత వ్యవస్థకు చేరుతుంది. ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునే సెల్ఫ్–ఎన్యూమరేషన్ సౌకర్యాన్ని సైతం సర్కార్ ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందే ప్రారంభమవుతుందని సీఎస్ కె. రామకృష్ణారావు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని కలెక్టర్లను సీఎస్ హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను పకాక్గా నిర్ధారించుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ఇల్లు, నివాసం, మారుమూల కుగ్రామం లేదా పట్టణ మురికివాడను కూడా ఈ జాబితా నుంచి మినహాయించకూడదన్నారు. ప్రతి కట్టడం వివరాలు తప్పనిసరిగా రికార్డుల్లోకి ఎక్కాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలపై హరీశ్‌రావు ఆగ్రహం



**హైదరాబాద్ ::** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీ శ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ముఖ్యమంత్రికి అసలు పరిపాలన చేయడం రావడం లేదని ఆయన విమర్శిం చారు. ఐఏ ఎస్, ఐపీఎస్ అధికారులను పదేపదే బదిలీ చేస్తూ ప్రభుత్వం వారిని మానసిక ఆందో ళనకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. అధికారులు ఒక ప్రాంతంలో పరిస్థితులను అర్థం చేసుకునేలోపే వారిని మార్చేయడం వల్ల రాష్ట్రంలో పాలన పూర్తిగా కుంటుపడుతోందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

## భూములు కోల్పోయే రైతులను అన్ని రకాలుగా

# ఆదుకుంటాం



**హైదరాబాద్, మార్చి 4:** ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక పరిహార చెల్లింపుకు సిద్ధంగా ఉన్నామని.. భూములు కోల్పోయే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయంగా తామే రైతుల వద్దకు వెళ్లి భూసేకరణ ప్రక్రియ చేపడతామని మంత్రులు వెల్లడించారు. గత ప్రభుత్వం భూసేకరణ, పరిహారంపై మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని, వారికి అమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరిస్తామని చెప్పారు. రామప్ప – లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై 15 రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రులు పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

# ఇది మనిషి సృష్టించిన విషాదం


## ఇరాన్‌లో 165 మంది బాలికల మృతిపై కేటీఆర్ కామెంట్



**హైదరాబాద్ :** ఇరాన్ పై ఇజ్రాయెల్ , అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి. ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్

# యుద్ధనౌకపై దాడి



**శ్రీలంక :** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా దాడులు ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇరాన్, లెబనాన్ రాజధానులపై అమెరికా–ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. మరోవైపు ఇరాన్ కూడా ప్రతీగా అమెరికా కాన్సులేట్‌పై దాడులు చేస్తోంది. శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడిఇరాన్‌కు చెందిన ఐరిస్ డెనా అనే యుద్ధ నౌకపై దాడిఇరాన్ యుద్ధనౌకపై దాడిలో 101 మంది గల్లంతు, 32 మందికి గాయాలుమునిగిపోతున్న యుద్ధనౌక నుంచి 32 మందిని కాపాడామన్న శ్రీలంక నేవీఅమెరికాతో చర్చలు జరిపే ఆలోచన తమకు లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికా యుద్ధాన్ని కొనసాగించవచ్చని ఖమేనీ సన్నిహితుడు ఒకరు పేర్కొన్నారు. తమతో ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చేసిన కామెంట్స్ కు కౌంటర్?గా ఇరాన్ ఈ ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌పై 40 క్షిపణులు ప్రయోగించిన ఇరాన్ సైన్యంఇరాక్, కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ డ్రోన్ల దాడివందలకొద్దీ డ్రోన్లతో దాడి చేశామని ప్రకటించిన ఇరాన్ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా చంపేస్తామన్న ఇజ్రాయెల్ఇప్పటివరకు ఇరాన్‌లో 1,097 మంది చనిపోయినట్లు యూఎస్ మానవహక్కుల సంస్థ వెల్లడిప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, శ్రీలంక నేవీ ఇప్పటివరకు 32 మందిని సురక్షితంగా రక్షించి ఒడ్డుకు చేర్చింది. గాయపడిన వారందరికీ స్థానిక ఆస్పత్రుల్లో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే, గల్లంతైన మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ దాడి ఎవరు చేశారు ఎందుకు అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో కలకలం సృష్టిస్తోంది.

# కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉంది

- కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టులో సర్కారు




**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీల నిర్మాణంతోపాటు మేడిగడ్డ కూలిపోవడానికి సంబంధించి బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి దురుద్దేశాలుగానీ ముందస్తు ప్రణాళికలుగానీ ఏమీ లేవని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. కమిషన్ అఫ్ ఎంక్వరీస్ చట్టం ప్రకారం కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని ఈ అధికారం కింద జీవో నంబర్ 6ను జారీ చేసినట్లు పేర్కొంది. అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్?, హరీశ్ రావు, ఐఏఎస్? అధికారిణి స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్? ఎస్?కే జోషి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ కొనసాగుతోంది. మంగళవారం ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతోపాటు మేడిగడ్డ కూలిపోవడానికి సంబంధించి బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి దురుద్దేశాలుగానీ, ముందస్తు ప్రణాళికలుగానీ ఏమీ లేవని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. జీవో నంబర్ 6ను జారీ : మేడిగడ్డ కుంగిపోయిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాల్లో భాగంగానే కమిషన్ నియామకం జరిగిందని తెలిపింది. కమిషన్ అఫ్ ఎంక్వరీస్ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని ఈ అధికారం కింద జీవో నంబర్ 6ను జారీ చేసినట్లు పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏలేరు కమిషన్ ఏర్పాటును సుప్రీం కోర్టు కూడా సమర్థించిందన్నారు. కమిషన్ ఏర్పాటు విధివిధానాల ప్రకారం నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందన్నారు. అందువల్ల ప్రజాప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఏపీలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు

# పెరుగుతున్నాయి



**విజయవాడ, మార్చి 04:** ఆంధ్రప్రదేశ్‌లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికమవుతున్నాయని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని తెలిపారు. బుధవారం విజయవాడలో రాయపాటి శైలజ విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖపట్నం మినహా అన్ని జిల్లాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై అన్ని విభాగాలతో కలిసి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్కొక్క జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఇవి పల్నాడు, కర్నూలు జిల్లాల్లో జరుగుతున్నాయని వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యం మీద పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు చదువుకోకపోవడం వల్ల కూడా టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగే అవకాశం ఉందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దీనిపై తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియా ద్వారా సైతం టీనేజర్లు ఆకర్షణకు గురవుతున్నారని తెలిపారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగిపోవడానికి ఇదీ ఓ కారణమని రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎంపీ రఘునందన్ రావుని కలసిన చేగుంట నాయి బ్రాహ్మణ సంఘశీ అధ్యక్షుడు మధు



**చేగుంట మార్చ్ 4 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలంలోని చేగుంట పట్టణ నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు మియాపురం మధు ఎంపీ రఘునందన్ రావు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.నాయి బ్రాహ్మణ సంఘం కు 330 సర్వే నెంబర్లో మీరు ఎమ్మెల్యేగా ఉన్నపుడు మాకు స్థలం ఇవ్వమని చేగుంట ఎమ్మార్వో చెప్పడం జరిగింది. చేగుంట ఎమ్మార్వో 330 సర్వే నెంబర్ లో స్థల సేకరణ చేసి ఆర్డిఓ కి అనంతరం కలెక్టర్ కి పంపడం జరిగినది ఇప్పుడు కలెక్టర్ దగ్గర మా స్థలం ఫైల్ ఉన్నది. మా యందుదయ తలచి మాకు ప్రొసిడింగ్ కాపీ ఇప్పించగలరని ఎంపీ రఘునందన్ రావుని కోరడం జరిగినది. ఎంపీ రఘునందన్ రావు స్పందించి త్వరలోనే మీకు స్థలం సంబంధించినప్రొసిడింగ్ కాపీని ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

# ముడు తరాల సర్పంచ్ ల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు






**చేగుంట మార్చ్ 04, మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం చందాయిపేట్ గ్రామం లో బుధవారం నిర్వహించిన హోలీ వేడుకల్లో 2006 నుండి 2026,ముడు తరాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,పాల్గొని గ్రామ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామం లో ఉన్న వివిధ పార్టీ ల నాయకులు,కార్యకర్తలు,యువత పాల్గొన్నారు.గ్రామం లో ఉదయం నుంచే యువత, చిన్నారులు గుంపులుగా చేరి రంగులతో సందడిచేసుకుంటు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొందరు డీజే సంగీతం మధ్య నృత్యాలు చేస్తూ ఆనందం పంచుకున్నారు. వీధులన్నీ రంగుల మయం కావడంతో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పరస్పరం మిఠాయిలు పంచుకుని సఖ్యతను చాటుకున్నారు. పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లిఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా హోలీ వేడుకలుప్రశాం తంగా,ఉత్సాహభరితంగా కొనసాగాయి. హోలీ పండగను ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవడం ద్వారా గ్రామ ప్రజలు సాంఘిక సౌహార్ద్రాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రవ ుం లో సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, మాజీ సర్పంచ్ బజారు లావణ్య జయరాం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఆనందాస్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నాగరాణి నగేష్, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# హోలీ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్.





**పటాన్ చెరు మార్చి : 04 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రంగుల పండుగ అయిన హోలీ సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన హోలీ ఉత్సవాలలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు, మిత్రులు, అభిమానులతో కలిసి రంగులు చల్లుకుంటూ హర్షాతిరేకంగా హోలీ పండుగను జరుపుకున్నారు.హోలీ పండుగ మనుషుల మధ్య ప్రేమ, ఐక్యత, ఆనందాన్ని పెంచే పండుగ అని ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. పటాన్చెరు ప్రాంత ప్రజలు అందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ నాయకులు, యువకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. రంగుల మధ్య స్నేహభావంతో పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పాల్గొన్న వారు తెలిపారు.
రంగుల పండుగ హోలీ అందరికీ సంతోషం, శాంతి, ఐక్యత తీసుకురావాలని కోరుకుంటూ...

# మాజీ మంత్రి హరీష్ రావుకు 'శత చండీ యాగ' ఆహ్వానం: ఆహ్వానించిన మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి మరియు ఎస్.వి.రాజు





**అమీన్పూర్: మార్చి : 04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ని వారి నివాసంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి మరియు శ్రీ మహాలక్ష్మీ చండీకేశ్వరి పీఠం చైర్మన్ ఎస్.వి.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. హోలీ పండుగను పురస్కరించుకుని హరీష్ రావు గారికి వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.లోక కల్యాణార్థం శత చండీ యాగ మహోత్సవం:ఈ సందర్భంగా బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన శ్రీ వారాహీ సహిత శత చండీ యాగము ఆహ్వాన పత్రికను హరీష్ రావు గారికి అందజేశారు. ఈ భక్తిపూర్వక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని వారు కోరారు.కార్యక్రమ వివరాలు:నిర్వహణ: ఈ యాగం శ్రీ మహాలక్ష్మీ చండీకేశ్వరి పీఠం చైర్మన్ శ్రీ ఎస్.వి.రాజు మరియు శ్రీమతి రమ్యరాజ్ దంపతుల ఆధ్వర్యంలో, జై భవాని ఉత్సవ కమిటీ సహకారంతో లోక కల్యాణార్థం అత్యంత వైభవంగా జరుగుతోంది.తేదీలు: 2026 మార్చి 7 మరియు 8వ తేదీలలో (శని, ఆదివారాలు) ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు యాగ కార్యక్రమాలు నిర్వహించబడతాయి.వేదిక: బీరంగూడ గుట్ట, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాంగణం.ఈ ఆహ్వాన కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, పీఠం చైర్మన్ ఎస్.వి.రాజులతో పాటు మాజీ కౌన్సిలర్ బిజిలి రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: బొల్లారం పోలీసులు

## ప్రవేశా పరిశ్రమలో కార్మికులకు అవగాహన కార్యక్రమం.






**జిన్నారం మార్చి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
బొల్లారం: ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని, ప్రజలు ముఖ్యంగా కార్మికులు సైబర్ నేరగాళ్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని బొల్లారం పోలీసులు సూచించారు. బుధవారం బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రవేశా ఇండస్ట్రీస్ లో కార్మికులకు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.బొల్లారం ఎస్సై కిష్టారెడ్డి, సైబర్ క్రైమ్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులకు పలు కీలక సూచనలు చేశారు.నేరగాళ్లు ఎంచుకునే మార్గాలు – పోలీసుల హెచ్చరిక:సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని పోలీసులు వివరించారు:హాలిడే ప్యాకేజీలు: తక్కువ ధరకే విదేశీ యానాం లేదా విహారయాత్రలంటూ వచ్చే ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి.ఫేక్ కస్టమర్ సర్వీస్: బ్యాంక్ లేదా ఇతర కంపెనీల కస్టమర్ కేర్ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే వారిని నమ్మి వ్యక్తిగత వివరాలు వెల్లడించకూడదు.
సెల్ టవర్ ఏర్పాటు: మీ ఖాళీ స్థలాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామని, భారీగా అద్దె వస్తుందని ఆశ చూపి డబ్బులు వసూలు చేసే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.హోటల్ బుకింగ్: ఆన్లైన్ హోటల్ బుకింగ్స్ పేరుతో వచ్చే అనుచిత ఫోన్ కాల్స్ మరియు లింక్‌లను క్లిక్ చేయవద్దు.
ప్రతి వారం అవగాహన:శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి వారం నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో ఈసారి సైబర్ నేరాలను ప్రధానాంశంగా తీసుకున్నట్లు ఎస్సై కిష్టారెడ్డి తెలిపారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది, ప్రవేశా పరిశ్రమ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# చిన్న పెద్ద తేడా లేకుండా జరుపుకునే పండుగ హోలీ: నీలం మధు ముదిరాజ్..





**హోలీ వేడుకలో పాల్గొన్న నీలం..**
**పటాన్ చెరు మార్చి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
చిన్న పెద్ద తేడా లేకుండా సంతోషంగా రంగులు చల్లుకుంటూ జరుపుకునే వేడుక హోలీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.. బుధవారం హోలీ పండుగ సందర్భంగా ఆయన ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు ప్రజలతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో హోలీ జరుపుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని తపస్సును భంగపరిచినందుకు కామదేవుడిని శివుడు తన త్రినేత్రంతో బూడిద చేస్తాడు, ఆ తర్వాత కామదేవుని భార్య రతి కోరిక మేరకు శివుడు కామదేవుడిని బ్రతికిస్తాడు, ఈ సంఘటనను గుర్తుచేస్తూ దేశవ్యాప్తంగా హోలీ జరుపుకుంటారని ఆయన తెలిపారు..

# అమీన్‌పూర్‌లో ఘనంగా హోలీ వేడుకలు: మహిళలు, చిన్నారులతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న కాటా సునీత రాజు గౌడ్





**అమీన్‌పూర్: మార్చి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని అమీన్‌పూర్ గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం అమీన్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకురాలు కాటా సునీత రాజు గౌడ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఆటపాటలతో సందడి:ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, గ్రామస్తులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ముఖ్యంగా చిన్నారులతో కలిసి కాటా సునీత రాజు గౌడ్ ఆటపాటల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. గ్రామస్తులందరి మధ్య ఈ పండుగ వాతావరణం సోదరభావాన్ని చాటిచెప్పింది.కాటా సునీత రాజు గౌడ్ వ్యాఖ్యలు:ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "రంగుల పండుగ హోలీ మనందరి జీవితాల్లో వెలుగులు నింపాలి. గ్రామంలోని మహిళలు, సోదరీమణులు మరియు చిన్నారుల మధ్య ఇలా పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన భారతీయ సంస్కృతికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు, అమీన్పూర్ గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 6న మెగా రక్తదాన శిబిరం




**,మర్చి 4,శ్రీకాకుళం:** శ్రీకాకుళం అంతర్జాతీయ మహిళా దినోత్సవం శిబిరం నిర్వహించనున్నట్టు మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ పి సాగరిక తెలిపారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం గైనకాలజిస్ట్ డాక్టర్ బలగ రజిని, జనరల్ ఫిజీషియన్ కే అమూల్యలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలకు ఆరోగ్య సంబంధిత వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దైనందిన జీవితంలో మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం పట్టించుకుంటున్నారు తప్ప వారి ఆరోగ్యం కోసం ఆలోచన చేయడం లేదని తెలిపారు. మహిళల్లో వ్యాధులను ముందుగా గుర్తించి వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించి 6,7 తేదీలలో ఉచితంగా ఓపి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా 50 శాతం రాయితీతో మహిళలకు ల్యాబ్ పరీక్షలు కూడా చేయడం జరుగుతుందని వివరించారు. గైనకాలజిస్ట్ ఆరో తేదీన మెగా రక్త దాన శిబిరం మెడికవర్ రెండో బ్లాక్ లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గైనికాలజిస్ట్ డాక్టర్ బలగ రజని మాట్లాడుతూ ముఖ్యంగా మహిళల్లో ఇటీవల అధికంగా ప్రబలుతున్న గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కల్పించడం, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష ( పాప్ స్మియర్) ఉచితంగా చేయబడుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకో వాలని చెప్పారు.

# సూచనల కంటే సలహాలే మేలు

**- మార్గదర్శి వికాసాభివృద్ధి కార్యక్రమం (ఎండీపీ)లో స్పష్టీకరించిన నిపుణులులి**






**పటాన్ చెరు మార్చి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
విద్యార్థు(మెంటీ)లకు మార్గదర్శి (మెంటార్)గా వ్యవహరించే అధ్యాపకులు, వారికి సూచనలు ఇవ్వడం కంటే సలహా పూర్వకంగా చెప్పడమే మేలని నిపుణులు అభిప్రాయపడ్డారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల మెంటర్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ (ఎండీపీ) బుధవారం ఆరంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ పి.సరిత, డాక్టర్ రోజీనా మాథ్యూల నేతృత్వంలో, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ)లోని కౌన్సెలింగ్ అండ్ మెంటరింగ్ (సీసీ అండ్ ఎం) సీనియర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి. ఉమాదేవి పర్యవేక్షణలో దీనిని నిర్వహిస్తున్నారు.గీతంలోని మార్గదర్శక పర్యావరణ వ్యవస్థను (మెంటరింగ్ ఎకోసిస్టమ్) బలోపేతం చేయడానికి ఈ శిక్షణను ఏర్పాటు చేయగా, మూడు ప్రాంగణాలకు చెందిన దాదాపు 210 మంది అధ్యాపకులు ఇందులో పాల్గొంటున్నారు. గతంలో, టాలెంట్ మెట్రిక్స్ సంస్థ సహకారంతో ఐదుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, గీతం మూడు ప్రాంగణాలలోని దాదాపు 1400 అధ్యాపకులకు సమిష్టిగా శిక్షణ, సర్టిఫైడ్ మెంటర్లుగా గుర్తింపును ఇచ్చారు. 25 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన మేనేజ్ మెంట్ కన్సల్టింగ్, టాలెండ్ ట్రాన్స్ ఫర్మేషన్ సంస్థ టాలెంట్ మెట్రిక్స్, అంచనా, అభివృద్ధి పద్ధతులలో లోతైన నైపుణ్యాన్ని గడిచింది. ఈ సంస్థ మనదేశమంతటా ప్రముఖ కార్పరేట్లతో భాగస్వామ్యం కలిగి ఉండడమే గాక, నాయకత్వ అభివృద్ధి, సామర్థ్య మెరుగుదలకు గణనీయంగా దోహదపడుతోంది. ప్రస్తుత శిక్షణ కార్యక్రమాన్ని అనుభవజ్ఞులైన నిపుణులు రవీంద్రనాథ్ మోక్షగుండం, శ్రీనివాస్ గొట్టుముక్కల నిర్వహిస్తున్నారు. మెంటరింగ్, నాయకత్వ అభివృద్ధి, సంస్థాగత పరివర్తనలో వీరికి మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది.అధ్యాపక మార్గదర్శకులను అధునాతన మార్గదర్శక నైపుణ్యాలు, ప్రభావవంతమైన కమ్యూనికేషన్ వ్యూహాలు, విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన, వ్యక్తిగత వృద్ధికి తోడ్పడే ఆచరణాత్మక సాధనాలతో సన్నద్ధం చేసేలా ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని రూపొందించారు. గీతం మెంటర్ కోఆర్డినేటర్లు డాక్టర్ విష్ణు నందిమల్ల, డాక్టర్ ఎం.విన్యాస్, డాక్టర్ వి.బి.తుషార్, డాక్టర్ బి.జ్యోతి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జి.వి.రమ్య ఈ ఎండీపీని సమన్వయం చేస్తున్నారు.ఇటువంటి నిర్మాణాత్మక చొరవల ద్వారా, గీతం అధ్యాపకులను ప్రభావవంతమైన మార్గదర్శకులుగా తీర్చిదిద్దడం ద్వారా సమగ్ర విద్యార్థి అభివృద్ధికి తన నిబద్ధతను బలోపేతం చేస్తూనే ఉంది.

## ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ కోదండ రామాలయాన్ని దర్శించిన బి.మఠం పీఠాధిపతులు



**బ్రహ్మంగారిమఠం మార్చి 4:** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని,శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం పీఠాధిపతులు శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారి ధర్మపత్ని ఉమాదేవి గారు కుటుంబ సమేతంగా బుధవారం నాడు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఒంటిమిట్ట కోదండ రామ స్వామి దేవాలయం అధికారులు,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు.

# పటాన్ చెరు లో హోలీ సంబరాలు: ముందస్తుగా రంగులు చల్లుకున్న ఎమ్మెల్యే





**సాంప్రదాయ పద్ధతిలో శుభాకాంక్షలు తెలిపిన మార్వాడీ సమాజం**
**పటాన్ చెరు మార్చి: 04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రంగుల పండుగ హోలీని పురస్కరించుకొని పటాన్ చెరు నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకల్లో పటాన్ చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని నియోజకవర్గ ప్రజలతో కలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు.సాంప్రదాయ వేడుకలు:బీరంగూడకు చెందిన కుమవత్ మార్వాడి సమాజం ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి, వారి సాంప్రదాయ పద్ధతిలో హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి సంస్కృతిని కొనియాడారుఐక్యతకు ప్రతీక – ఎమ్మెల్యేఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "హోలీ పండుగ మనందరి జీవితాలలో ఐక్యత, ప్రేమ మరియు ఆనందాన్ని నింపాలి. రంగుల పండుగలాగే ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో నిండాలి" అని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు: అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ జిన్నారం మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి,మరియు ఇతర సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

## నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి-ఎంపీడీఓ రామచంద్రారెడ్డి



**బ్రహ్మంగారిమఠం మార్చి 4:**నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఆదేశించారు.బుధవారం ఎంపీడీఓ తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఇంటి పన్నులు కట్టి అభివృద్ధికి సహకరించాలని కోరారు.అనంతరం ఎంపీడీవో పంచాయతీ ఓటర్ల జాబితా,ఏకీకృత కుటుంబ సర్వే తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు.అంతకుముందు ఆయన బ్రహ్మంగారిమఠం,తోట్లపల్లె గ్రామాల్లో పర్యటించి ఇంటి పన్నుల కార్యక్రమాన్ని పరిశీలించారు.పై కార్యక్రమాల్లో పరిపాలన అధికారి నరసయ్య,పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

# పాక్‌ను సామంత దేశంగా మార్చడానికి అఫ్గాన్, ఇరాన్, భారత్‌లు కుట్ర చేస్తున్నాయి': ఖవాజా ఆసిఫ్




**పాకిస్థాన్ :** పశ్చిమాసియాలో రగులుతున్న ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ జ్వాలలు ఇప్పుడు పొరుగునే ఉన్న పాకిస్థాన్‌ను కూడా వణికిస్తున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ దీనిపై చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇరాన్‌పై జరుగుతున్న దాడుల వెనుక ఇజ్రాయెల్ భారీ వ్యూహం ఉందని, ఆ వ్యూహం అంతిమంగా పాకిస్థాన్ ఉనికినే దెబ్బతీసేలా ఉందని ఆయన ఆరోపించారు. దీన్ని అదునుగా చేసుకుని అఫ్గాన్, ఇరాన్, భారత దేశాలు తమ దేశాన్ని సామంత దేశంగా మార్చడానికి కుట్ర చేస్తున్నాయంటూ చెప్పుకొచ్చారు. పాకిస్థానే లక్ష్యంగా జియోనిస్ట్ కుట్ర..!ఖవాజా ఆసిఫ్ తన సోషల్ మీడియా వేదికగా ఇజ్రాయెల్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ అణు ఒప్పందంపై చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. అమెరికా, ఇజ్రాయెల్ కావాలనే టెహ్రాన్‌పై యుద్ధాన్ని రుద్దాయని ఆయన పేర్కొన్నారు. "ఈ యుద్ధం కేవలం ఇరాన్ కోసమే కాదు. ఇజ్రాయెల్ తన ప్రభావాన్ని పాకిస్థాన్ సరిహద్దుల వరకు విస్తరించుకోవడానికి ఆడుతున్న నాటకం" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పటి నుంచి ఇస్లామిక్ ప్రపంచంలో జరుగుతున్న ప్రతి విధ్వంసం వెనుక జియోనిజం (యూదు భావజాలం) హస్తం ఉందని ఆయన ఆరోపించారు.భారత్, అఫ్గాన్‌ల ఉమ్మడి ఎజెండా?ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ గెలిస్తే.. అది పాకిస్థాన్‌కు పెను ప్రమాదమని ఆసిఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ అండతో భారత్, అఫ్గాని స్థాన్‌లు ఏకమై పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి చుట్టుముట్టే అవకాశం ఉందని ఆయన జోస్యం చెప్పారు. "భారత్, అఫ్గాన్, ఇరాన్‌ల ఉమ్మడి ఎజెండా ఇప్పుడు పాకిస్థాన్‌పై శత్రుత్వమే. మమ్మల్ని శత్రువులతో చుట్టేసి, పాకిస్థాన్‌ను ఒక సామంత దేశంగా మార్చాలని చూస్తున్నారు" అని ఆయన మండిపడ్డా రుల.25 కోట్ల మందికి పిలుపు..పాకిస్థాన్ ఒక అణుశక్తి గల దేశమని, తమ సైన్యం ధైర్యసాహసాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తుందని ఆయన గుర్తు చేశారు. రాజకీయ, మతపరమైన విభేదాలను పక్కనపెట్టి.. తమ నిత్య శత్రువులు పన్నుతున్న ఈ కుట్రను పాకిస్థాన్‌లోని 25 కోట్ల మంది ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దశాబ్దాలుగా జియోనిస్టులే శాసిస్తున్నారని.. ఇప్పుడు వారి చూపు పాక్ సరిహద్దులపై పడిందని ఆయన హెచ్చరించారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడిలో వేలం పాటలు-50 లక్షలు ఆదాయం



**బ్రహ్మంగారిమఠం మార్చి 4:-**
శ్రీ గోవిందామాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రిస్వామి ఆదేశాల మేరకు బ్రహ్మంగారి ఆలయంలో కొబ్బరి చిప్పలు వసూలు చేసుకొనుటకు,పోలేరమ్మ గుడి దగ్గర టెంకాయలు అమ్ముకొనుటకు మరియు కొబ్బరిచిప్పలు వసూలు చేసుకొనుటకు,డార్మేశీటరి హాల్ లాకర్ లకు వసూలు చేసుకొనుటకు,పాదరక్షలు భద్రపరచి వసూలు చేసుకొనుటకు,లెట్రిన్లు శుభపరచుకొని వసూలు చేసుకొనుటకు వివిధ రకాల వేలం పాటలను నిర్వహించగా 50 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరచారి తెలియజేశారు.ఇవే పాటలను గత ఏడాది నిర్వహించగా 30 లక్షల 50 వేల రూపాయలు వచ్చాయని,ఈ ఏడాది అదనంగా 20 శాతం అధికంగా ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు.

# కేంద్ర మాజీ మంత్రి కేపీ ఉన్నికృష్ణన్ కన్నుమూత!



**న్యూ ఢిల్లీ :**భారత రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కేపీ ఉన్నికృష్ణన్ (89) మంగళవారం కన్ను మూశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, కేరళలోని కోజికోడ్‌లో ఉన్న తన నివాసంలో తుది శ్వాస విడిచారు. 1980వ దశకంలో జాతీ య రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఉన్నికృష్ణన్ మరణవార్త తెలియగానే రాజకీయ వర్గాల్లో విషాద ఛాయలు అలముకు న్నాయి.ఆరు సార్లు ఎంపీగా రికార్డు.. వీపీ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగాకేపీ ఉన్నికృష్ణన్ రాజకీయ ప్రస్థానం ఎంతో స్ఫూర్తి_దాయకమైనది. కేరళలోని వడకర నియోజకవర్గం నుండి ఆయన వరుసగా ఆరు సార్లు లోక్‌సభకు ఎన్నికై రికార్డు సృష్టించారు. 19 71 నుండి 1996 వరకు ఆయన పార్లమెంటులో తన గళాన్ని బలంగా వినిపించారు.కేంద్ర మంత్రిగా: 1989-90 కాలంలో మాజీ ప్రధాని వీపీ సింగ్ మంత్రివర్గంలో ఆయన ఉపరితల రవాణా మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.ర్టీల ప్రస్థానం: తొలినాళ్లలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, తర్వాత కాలంలో కాంగ్రెస్ (ఎస్) మరియు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ () లో కీలక నేతగా ఎది గారు.పార్లమెంటేరియన్‌గా ప్రత్యేక గుర్తింపుఉన్నికృష్ణన్ కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, అద్భుతమైన వక్తగా మరి యు పార్లమెంటరీ నిబంధనలపై పట్టున్న మేధావిగా గుర్తింపు పొ ందారు. సంక్లిష్టమైన అంశాలపై ఆయన చేసే ప్రసంగాలు అందరినీ ఆకట్టుకునేవి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం తపించేవారు. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో రవాణా మరియు టెలికాం రంగాల్లో పలు సంస్కరణలకు ఆయన నాంది పలికారు.రాజకీయ నేతల సంతాపంఉన్నికృష్ణన్ మరణం పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఇతర జాతీయ స్థాయి నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కేరళ రాజకీయాల్లో ఒక శకం ముగిసిందని, ఆయన మరణం రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వగ్రామంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# భూమి ఇచ్చేందుకు సిద్ధం
# పంచగ్రామాల సమస్యలపై మంత్రి ఆనం

**అమరావతి, మార్చి 4:** సింహాచలం దేవస్థానం పరిసరాల్లోని పంచగ్రామాల సమస్యపై విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. పంచగ్రామాలు ఐదు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. 1996లో అప్పల సూర్యనారాయణ ఆధ్వర్యంలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారని... ఆ తర్వాత 2000లో 578 జీఓ, 2019లో 229 జీఓలు జారీ చేశారన్నారు. పంచగ్రామాల్లో రైతుల సమస్యలతో పాటు ఇళ్లు నిర్మించుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సభలో తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 100 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 100 గజాల లోపు స్థలం ఉచితంగా ఇచ్చేలా, అంతకంటే ఎక్కువ ఉంటే డబ్బు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే చరిత్ర క్షమించదన్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ మంత్రులు



కూర్చొని తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రశ్నకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమాధానమిస్తూ... గతంలో అసెంబ్లీ హౌస్ కమిటీ, మంత్రివర్గ ఉపసంఘాలు నివేదికలిచ్చాయని తెలిపారు. వాటి ఆధారంగా జీఓలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే ఆలోచనలో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర విధానం రూపొందించిందని వివరించారు. కొందరి భూములు క్రమబద్ధీకరించిన తర్వాత మళ్లీ కోర్టుకు వెళ్లడంతో సమస్య తలెత్తిందని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ, రెవెన్యూ శాఖలను సమావేశపరిచి పరిష్కారం చూడాలని సీఎం సూచించారని తెలిపారు. సర్వే పూర్తి చేసిన తర్వాత 12,410 నివాసాలు ఉన్నట్లు తేలిందని, వాటన్నింటినీ క్రమబద్ధీకరించడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి వివరించారు. అంతే విలువైన భూమిని సింహాచలం ఆలయానికి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించగా.. సింహాచలం ట్రస్టు సమ్మతించిందని మంత్రి తెలిపారు. భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయాలను హైకోర్టుకు అఫిడవిట్ రూపంలో అందజేశామని చెప్పారు. హైకోర్టు ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్: హోంమంత్రి



**అమరావతి, మార్చి 4:** ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.


## నా ఆస్తులపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు: అంబటి రాంబాబు



**గుంటూరు జిల్లా, మార్చి 4:** కూటమి ప్రభుత్వం తనపై, తన కుటుంబంపై చేసిన పాశవికమైన దాడి అందరూ చూశారని మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు మినహా.. రాష్ట్ర ప్రజలు దీనిని దారుణమైన సంఘటనగా పరిగణించారని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనకు సత్తెనపల్లిలో 22 ఎకరాల పొలం ఉందని.. ఆ పొలానికి కూడా సర్వే పేరుతో నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. ఇవాళ(బుధవారం) గుంటూరు వేదికగా మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడారు. తన పొలాన్ని సర్వే చేయాలని ఎమ్మార్వో కార్యాలయం నుంచి తనకు నోటీసులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ తనిఖీ చేయమని చెప్పారని వారు తనకు చెప్పారన్నారు. తన పొలంలో స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్ ఉందని.. సర్వే చేయాలని అధికారులు చెబుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు పని ఏమి లేదా అని ప్రశ్నించారు. నా ఆస్తుల మీద పడ్డారు..వారు తన ఆస్తుల మీద పడ్డారని... తాను లీగల్‌గా కొన్న స్థలమని చెప్పుకొచ్చారు. తాను వేరే వారి నుంచి పొలం కొనుక్కునే ముందే అందులో చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అధికారం శాశ్వతం కాదన్నారు. తన దగ్గర దాపరికాలు ఏమి ఉండవని.. చంద్రబాబు, లోకేశ్ తన పొలం చూస్తాను అంటే రావాలని అన్నారు. తనను భయపెట్టాలని వారు అనుకుంటున్నారని.. రేపు గుంటూరులో తమ ఇంటికి కూడా నోటీసులు ఇస్తారేమోనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# పంట మార్పిడి అవసరం.. డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయండి: మంత్రి

అమరావతి, మార్చి 4: ఏపీ శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా రాష్ట్రంలో వివిధ సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా వరి రైతులకు నష్టాలు, సేంద్రీయసాగు ప్రత్యామ్నాయ పంటలపై ఎమ్మెల్యేలు నడికుడితి ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. నీరు కనిపిస్తే చాలు రైతులు వరి పంట వేస్తున్నారని తెలిపారు. రైతులు వరి నుంచి ఇతర పంటల వైపు మారకపోతే నష్టాలు తప్పవన్నారు. ప్రస్తుతం వరి ద్వారా ఎకరాకు రూ.6 వేల మాత్రమే ఆదాయం వస్తుందని, అదే సమయంలో కంది ద్వారా రూ.26 వేలు, మినుములు రూ.21 వేలు, జొన్న ద్వారా రూ.16 వేల ఆదాయం సాధ్యమని వివరించారు. ప్రత్యేకంగా పామాయిల్ పంటపై దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పామాయిల్ సాగు చేస్తే ఎకరాకు రూ.1.60 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. అందుకే పామాయిల్ పంట పండించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పంట



వైవిధ్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, భూసారం పెంచటానికి సూక్ష్మ పోషకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆమోదించిన విత్తనాలను మాత్రమే సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మార్కెట్ డిమాండ్ ఆధారంగా వరి రకాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రాధాన్య రకాల విత్తనాలను రాయితీపై అందజేస్తున్నామని వెల్లడించారు. సాగునీటి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు మంత్రి. పంట మార్పిడి కోసం 15 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి జిల్లాల్లో వరి తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని, కానీ ఇతర ప్రాంతాల్లో పంట మార్పిడి అవసరమని సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. కౌలు రైతులకు కూడా రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని, మొక్కజొన్న పంట కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ఏపీ శాసనమండలిలో రెండు కీలక బిల్లులకు ఆమోదం

**అమరావతి, మార్చి 4:** ఏపీ శాసనసభ ఆమోదించిన రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు–2026 , ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు 2026కు శాసనమండలిలో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. గత గురువారం శాసనసభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజు ద్వారా కేటాయించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు రేటు నిర్ణయించారని.. ప్రతి రెండేళ్లకు 5 శాతం వరకు లీజు మొత్తం పెంచే విధంగా సవరణ చేసినట్లు తెలిపారు. అసైనీ దారులకు ఈ లీజు ద్వారా నికరమైన ఆదాయం లభిస్తుందన్నారు. బంజరు భూములు, చౌడు భూములుగా ఉన్న అసైన్డ్ భూములకు స్థిరమైన ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు క్లీన్ ఎనర్జీ చాలా కీలకమని మంత్రి చెప్పారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమవుతాయని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అసైనీదారుల పూర్తి అనుమతితోనే లీజుకు తీసుకుంటామని వెల్లడించారు. ట్రై–పార్టీ అగ్రిమెంట్ ద్వారా వారికి పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తా



మని అన్నారు. ఈ చట్ట సవరణతో రూ.10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు–2026కు కూడా శాసనమండలి ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాలను 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు'లుగా మార్చే సవరణకు ఆమోదం లభించింది.

## ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే మా లక్ష్యం

**అమరావతి, మార్చి 4:** ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి బాధిత కుటుంబాలను ఆదు కునేందుకు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల బిల్లు సవరణకు సంబంధించిన బిల్లును మంత్రి లోకేశ్ (బుధవారం) ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025 సెప్టెంబర్ 27వ తేదీన అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదించి శాసనమండలికి పంపించామని ప్రస్తావించారు. అక్కడ బిల్లు ప్రవేశపెట్టలేదని. వంద రోజులు దాటడంతో మళ్లీ బిల్లు అసెంబ్లీకి వచ్చిందని చెప్పుకొ చ్చారు. 1996లో చంద్రబాబు సీఎం అయ్యాక ఫ్యాక్షన్ రాజకీయాలపై యుద్ధం ప్రకటించారని గుర్తుచేశారు. 164 మంది కార్యకర్తలను చంపేశారు.. 2004 తర్వాత దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 164మంది తెలుగుదేశం కార్యకర్తలను దారుణంగా చంపేశారని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలను పరామర్శించి వెళ్లే లోపే మరో హత్య జరిగిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ హత్యలకు గురైన వారి పిల్లలను చదివించేందుకు ఎన్టీఆర్



స్కూల్లో ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆ పిల్లలు ఫ్యాక్షన్‌లోకి వెళ్లకుం డా మంచి భవిష్యత్తు ఉండేలా తాము చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని అన్నారు. 2019 నుంచి 2024 మధ్యలో కూడా ఇలాంటి హత్యలు చాలా జరిగాయని ప్రస్తావించారు. బీసీ వర్గానికి చెం దిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12వ తేదీన దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన నిలబడ్డారని.. ప్రజల కోసం పోరాడారని కీర్తించారు. చంద్రయ్యను గొంతు కోసి చపారు..చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వటం కోసం కూటమి పార్టీలు సమ్మతించాయని తెలిపారు. గతంలో శాసనసభలో ఈ బిల్లుకు ఆమోదం లభించినా. శాసనమండలి దాన్ని పక్కన పెట్టిందని చెప్పుకొచ్చారు. కనీసం బిల్లుని తిరస్కరించినా.. మనం అసెంబ్లీలో ఆమోదిం చుకునేవాళ్లమని తెలిపారు. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలని, ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి... ఇలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి నారా లోకేశ్ కోరారు.

# ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్‌గా తిరుపతి

**తిరుపతి :** పాతికేళ్ల కిందట వరకు అప్పటి రద్దీకి తగ్గట్టుగా తిరుపతి మీదుగా 20 రైళ్లు రాకపోకలు సాగించేవి. తర్వాత తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సామాన్య ప్రయాణికుల సంఖ్య అమాంతంగా పెరిగింది. ఈ రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్య పెంచాల్సి వచ్చింది. దేశంలోని ప్రధాన నగరాల నుంచి తిరుపతి మీదుగా వెళ్లే రైళ్ల సంఖ్యను ఏటా పెంచుతూ వచ్చారు. ప్రస్తుతం రోజుకు 102 రైళ్లు నడుస్తున్నాయి. రైల్వే స్టేషన్ పలుమార్లు ఆధునీకీకరించినా ప్రయాణికులకు అనుకూలంగా లేదు. స్థలాభావంతో సౌకర్యాల కొరతగానే ఉంటోంది. స్టేషన్ నుంచి బయటకు రావడానికి, లోపలకు వెళ్లడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారాంతంలో, సెలవుల్లో అయితే మరిన్ని కష్టాలు తప్పవు. ఈ సమస్యలను ప్రత్యక్షంగా చూసిన కేంద్ర పెద్దలు స్పందించి చర్యలు చేపట్టారు. వచ్చే 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని రైల్వేస్టేషన్ రూపురేఖలు మార్చాలని సంకల్పించారు. ఆ దిశగా నిర్మాణ పనులు మొదలుపెట్టారుఅదనంగా ఐదు ప్లాట్‌ఫామ్స్..ప్రస్తుతం ఆరు ప్లాట్‌ఫామ్స్, ఐదు ఫిట్‌లైన్లు (మరమ్మతులు, చెక్కింగ్, స్టేరింగ్ ట్రాక్స్) ఉన్నాయి. రోజూ 182 రైళ్లు రాకపోకలు సాగిస్తుండటంతో ప్లాట్‌ఫామ్స్ కొరత కారణంగా ఊరు బయటనే పలురైళ్లు కాసేపు ఆగాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పుడు ఫిట్‌లైన్లను తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు తరలించే ప్రతిపాదన ఉంది. తర్వాత ఫిట్‌లైన్ల స్థానంలో మరో ఐదు ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రానున్నాయి. మొత్తం ప్లాట్‌ఫామ్స్ 11కు పెరుగుతాయి. తిరుపతి రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ఏర్పాట్లతో ఉత్తర, దక్షిణ దిశల్లో రెండు భారీ భవనాలు, స్టేషన్ ప్లాట్‌ఫామ్స్ ఆధునికీకరణ లిఫ్టులు, ఎస్కలేటర్లు




వంటి అత్యాధునిక సౌకర్యాలు కల్పించడానికి రూ.321కోట్లు కేటాయించారు. ఈ క్రమంలో 2022 మే నెలలో ప్రారంభించిన పనులు కొలిక్కి వచ్చాయి. రైళ్ల రాకపోకలకు ప్రయాణికుల సంచారానికి ఎలాంటి ఆటంకం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూనే నిర్మాణాలు కొనసాగించారు. దక్షిణదిశ భవనం దాదాపు పూర్తి కావచ్చింది. ప్రస్తుతం తుదిమెరుగుల పనులు జరుగుతున్నాయి. కొరత వసులు కూడా రాత్రింబవళ్లు పూర్తిచేసి మార్చిలో అందుబాటులోకి తేవాలని రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పుడిప్పుడే పనుల్లో వేగం పుంజుకున్న ఉత్తర దిశ భవనం డిసెంబరులో అందుబాటులోకి రానుందని రైల్వేఅధికార యంత్రాంగం ద్వారా తెలుస్తోంది. ప్రపంచస్థాయి ⁻కర్యాలు. నూతనంగా అందుబాటులోకి రానున్న తిరుపతి రైల్వేస్టేషన్ పూర్తిగా సీసీ టీవీ సెక్యూరిటీ పరిధిలో ఉంటుంది. స్టేషన్ విస్తీర్ణం ధీటుగా ఆర్పీఎఫ్ బలగాల పెంపు, స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యాలు, 20 కేవీ విద్యుత్ ఉత్పత్తికి రెండు భవనాలపై సోలార్ వ్యవస్థ ఏర్పాటు, అన్ని ప్లాట్‌ఫామ్స్‌కు కలిపి మొత్తం 26 లిఫ్టులు, 24 ఎస్కలేటర్లు వర్షపు నీరు నేరుగా భూమిలోకి ప్రవేశించేలా ప్రత్యేక ఏర్పాట్లు కలవు. రెండు ఎయిర్ కాన్ కోర్సులు..దేశంలోనే భోపాల్ తర్వాత తిరుపతి రైల్వేస్టేషన్‌లోనే ప్రయాణం కాలక్షేపం కోసం రెండు ఎయిర్ కాన్ కోర్సులు ఏర్పాటు చేస్తున్నారు. రైళ్ల కోసం నిరీక్షించే ప్రయాణికుల సౌకర్యార్థం ట్రాక్స్‌కు ఇరువైపులా ఉన్న ఉత్తర, దక్షిణ భవనాల వరకు 61 మీటర్ల పొడవు, 12 వెడల్పుతో దీనిని నిర్మించారు. ఇందులో రూఫ్‌ప్లాజ్, మరుగుదొడ్లు, కుర్చీలు, విశ్రాంతి బల్లాలు వంటి సకల సదుపాయాలు కల్పించారు. వీటికి లిఫ్టులు, ఎస్కలేటర్లను అనుసంధానించారు. రైళ్లు వచ్చిన సమయానికి ప్రయాణికులు అక్కడి మంచి ప్లాట్‌ఫామ్స్‌కు చేరుకోవచ్చు. మల్టీలెవల్ కార్ పార్కింగ్..నూతన రైల్వేస్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన వెంటనే ప్రస్తుతమున్న రైల్వేటిక్కెట్ బుకింగ్, కార్యాలయాల భవనాన్ని కూల్చి వేయనున్నారు. దానిస్థానంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ సౌకర్యాలు కల్పించనున్నారు. ఐదు అంతస్తుల్లో రెండు కార్ పార్కింగ్, రెండు వెయిటింగ్ హాల్స్ చివరి అంతస్తులో కార్యాలయాలు, విశ్రాంతి గదులు, క్లాక్‌రూమ్స్, లాకర్స్, రన్నింగ్ రూమ్స్, ఉద్యోగుల రెస్ట్‌రూమ్స్, మెడిటేషన్, డైనింగ్, సెమినార్ హాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

## వేట్లపాలెంలో పేలుడు ఘటనలో 25కి చేరిన మృతులు

**కాకినాడ, ఫిబ్రవరి 04:** వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ప్రమాద ఘటనలో మరొకరు మరణించారు. బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వీర శ్రీను (39) కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. మంగళవారం ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవరాజు మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిగిలిన ఐదుగురు క్షతగాత్రులకు వైద్య సేవలు



కొనసాగుతున్నాయి. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని పోలాల మధ్య ఏర్పాటు చేసిన కేంద్రంలో బాణసంచాను కార్మికులు తయారు చేస్తున్నారు. ఫిబ్రవరి 28వ తేదీన బాణసంచా కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఇద్దరు లోవరాజు, వీర శ్రీను.. మంగళ, బుధవారాల్లో మరణించారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో ఈ కమిటీని నియమించింది. ఈ ప్రమాద ఘటనకు బాధ్యులను గుర్తించాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ ప్రమాద ఘటనపై నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..